నోటికాడి పంటను ఎత్తగొట్టిండ్రు..

ఒక్కతడికైనా నీళ్లిస్తే పంటలు బతికేవి • పెట్టుబడి కూడా పూర్తిగా నష్టపోయాం

- పంటను కాపాడుడు మా వల్ల కాలేదు
- కేసీఆర్‌కు మొగ్దూంపూర్ రైతుల మొర
- సర్కారుపై పిడికిలి బిగించి కొట్లాడుదాం
- ఎన్నికలయ్యాక మేడిగడ్డ నీళ్లు మలుపు కొనేందుకు పోరాటం చేద్దాం: కేసీఆర్

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

(కరీంనగర్ నుంచి నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి): 'సారు.. నిరుడు, పోయినేడు పంట పొట్టకొచ్చిన తర్వాత కూడా పుష్కలంగా నీళ్లు ఉండేవి. పంట కోతలు మొదలుపెడ్తాం. నీళ్లు ఆపమని మేము అధికారులను అడిగేవాళ్లం. గుండివాగు, ఇరుకుల్ల వాగుల నీళ్లు ఆపిన తర్వాతే మేము పంటలు కోసుకునేవాళ్లం. ఇప్పుడేమో నీళ్లియ్యండి సారూ.. అని అధికారులను వేడుకుంటున్నా ఒక్కళ్లు మాట్లాడుతలేరు. పంట పాలుపడే టైంలోనే నీళ్లు లేవు. పంట మొత్తం ఎండి పోయింది. ఎకరానికి రూ.20-30 వేలు పెట్టుబడి పెట్టినం. మా కష్టం, కైకిలి పోయినా పర్వాలేదు. కనీసం పెట్టిన పెట్టుబడి అయినా మాకు వచ్చేతట్టు చూడుండ్రి సారూ..' అంటూ కరీంనగర్ రూరల్ మండలంలోని మొగ్దూంపూర్, బోయినపల్లి గ్రామాల రైతులు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి కే చంద్రశేఖర్‌రావుకు మొరపెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వహణ లోపం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండి తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతుల కష్టాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు కేసీఆర్ పాలంబాట పట్టారు. ఇప్పటికే జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటించిన కేసీఆర్.. శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల రైతులను కలిశారు. పొలాల వద్దకే వెళ్లి రైతులను ఓదార్చారు. వారి కష్టాలను విన్నారు. నెర్రలుబారిన పంటపొలాలను చూసి చలించిపోయారు. పేరుపేరున రైతులను పిలిచి మాట్లాడారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు తమ బాధలు చెప్పుకొని ప్రభుత్వం చేత నష్టపరిహారం ఇప్పించాలని విజ్ఞప్తిచేశారు.

నీళ్లు కావాల్సినప్పుడు అందలేవు...

'అష్టకష్టాలు పడి వరి పంట వేసినం. పాలు పడే సమయంలో ఇంకో 1-2 తడులకు నీళ్లు కావాల్సి ఉండె. ఇంకొక్క తడికి నీళ్లు ఇచ్చినా పంటలను దక్కించుకునేవాళ్లం. మా నోటికాడి పంటను ఎత్తకొట్టిండ్రు. కాలువల్లో నీళ్లు లేకపోవడంతో బావుల నుంచి నీళ్లు తెచ్చుకొనేందుకు పైప్‌లైన్ వేశాం. కానీ, బావుల్లో కూడా నీళ్లు లేవు. గడిచిన పదేండ్లలో ఇంతటి దారుణం ఎప్పుడూ చూడలే. మా పొలాలకు ఎస్సారెస్పీ డీ-89 కాలువ ద్వారా నీళ్లు వచ్చేవి. కానీ, ఈసారి ఇవ్వలేదు. అధికారులను అడిగితే సమాధానం లేదు. మీరే మాకు న్యాయం చేయాలి.. సారూ..' అంటూ మగ్దూంపూర్‌కు చెందిన రైతులు పొలగాని సంపత్, బండి సంపత్ కేసీఆర్‌కు విజ్ఞప్తిచేశారు.

ఈ దుస్థితిని రైతులు ఊహించలే..

'మా గ్రామం నుంచి ప్రతి సీజన్‌లో 18 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈసారి ఆరువేల క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చేలా కనిపించడం లేదు. పంట వేసే సమయంలో ఇలాంటి పరిస్థితి వస్తుందని రైతులు ఊహించలేదు సారూ' అని మొగ్దూంపూర్ గ్రామ మాజీ సర్పంచి జక్క నర్సయ్య కేసీఆర్‌కు వివరించారు.

నీళ్లు లేక పొలాలు నెర్రెలు వారాయి..

మా గ్రామంలో పంటలను చూస్తే పైకి బాగానే కనిపిస్తాయి. కానీ, పొలం లోపల చూస్తే అసలు విషయం తెలుస్తది. పచ్చని పైరుతో ఉన్న పొలాలు నీళ్లు లేక నెర్రెలు వారాయి. వరి కంకులుపైకి కనిపిస్తున్నప్పటికీ నీళ్లు సరిగ్గా అందక తాలుగా మారుతున్నాయి. బస్తాల్లో మిల్లులకు తీసుకుపోతే మిల్లర్లు తాలు వచ్చిందని వీటిని తీసుకోరు. వీటిని కోసి ఐకేపీ కేంద్రానికి తీసుకెళ్తే రూపాయి కూడా రాదు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మీరు మమ్మల్ని ఆదుకోవాలి సారూ..' అని రైతు గాండ్ల లక్ష్మీనారాయణ కేసీఆర్‌కు మొరపెట్టుకున్నారు.

పదెకరాల పంట ఎండిపోయింది

బోయినపల్లి వద్ద పదెకరాల భూమిని కౌలుకు సాగుచేస్తున్న. కిష్టమ్మ చెరువు ఒర్రె నుంచి నీళ్లు తీసుకొని పంట పండిస్తున్న. ఇన్నేండ్లలో ఏనాడూ కనీసం ఒక్క గుంట భూమి కూడా నీళ్ల లేక ఎండిపోలేదు. కానీ, ఈసారి మొత్తం పంట ఎండిపోయింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. భారీగా నష్టపోయిన ఆదుకునే మార్గం మీరే చూడాలి సారూ..' అని మిడ్ మానేరులో భూములు కోల్పోయిన చీర్లవంచకు చెందిన రైతు గంగు రమేశ్ కేసీఆర్‌కు మొరపెట్టుకున్నాడు.

మోటార్లు కాలిపోయాయి

'మల్లాపూర్‌లో మాకున్న పదెకరాల పొలం సాగుచేయగా, నీళ్లు లేక నాలుగు ఎకరాలు ఎండిపోయింది. కరెంటు ఓల్టేజ్‌లో హెచ్చుతగ్గుల వల్ల మోటార్లు కాలిపోయాయి. అనేక సార్లు రిపేర్లు చేయించాం. అయినా ఉపయోగం లేదు. కరెంటు సమస్యతోనే నాలుగు ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది' అని రైతు సోదరులు చల్లా వెంకట్ రెడ్డి, చల్లా లక్ష్మిరెడ్డి వాపోయారు.

అడుగడుగునా వరికంకులతో రైతులు...

కేసీఆర్ కరీంనగర్‌కు బయల్దేరింది మొదలు పార్టీ శ్రేణులు ఆయన వెంటే నడిచాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, బాల్క సుమన్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, చెన్నమనేని రమేశ్, పార్టీ నేతలు జీవీ రామకృష్ణారావు, తోట ఆగయ్య, కొండూరి రవీందర్‌రావు, తుల ఉమ, దావ వసంత, చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు తదితరులు కేసీఆర్ కాన్వాయ్‌తో కరీంనగర్ చేరుకున్నారు.

మార్గమధ్యంలో ప్రజలు పెద్దఎత్తున కేసీఆర్‌కు సంఘీభావం తెలుపుతూ రోడ్లపైకి వచ్చారు. మొగ్దూంపూర్ నుంచి బోయినపల్లికి వెళ్తుండగా మార్గమధ్యంలో రామడుగు మండలంలో, గంగధర మండలంలో రైతులు రోడ్లపైకి వచ్చి సంఘీభావం కేసీఆర్ తెలిపారు. వెదిర వద్ద రైతులంతా వరి కంకులు పట్టుకొని కేసీఆర్‌కు తమ ఇబ్బందులు చెప్పుకున్నారు. కాన్వాయ్ ఆపి మరీ కేసీఆర్ రైతుల కష్టాలను విన్నారు. రైతులు ఇచ్చిన వరి కంకులను తీసుకున్నారు.

పార్టీలో జోష్.. రైతుల్లో భరోసా

కరీంనగర్ అంటేనే బీఆర్ఎస్‌కు కంచుకోట. ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిన తర్వాత జిల్లాకు కేసీఆర్ రావడం ఇదే తొలిసారి. దీంతో కార్యకర్తలు పెద్దఎత్తున కదిలివచ్చారు. కేసీఆర్ జిల్లాలో ఉన్నంత సేపు నాయకులు, కార్యకర్తలు ఆయనతోనే ఉన్నారు. అడుగడుగునా కేసీఆర్ జై.. అంటూ నినాదాలు ఇచ్చారు. రైతులు ప్ల కార్డులు పట్టుకొని తమ పంట పొలాలు ఎలా ఎండిపోయాయో చూపించారు. కేసీఆర్‌కు కనిపించేలా ప్లకార్డులు ప్రదర్శించారు. రైతులు చేతులు ఎత్తి దండం పెడుతూ సమస్యలను పరిష్కరించాలని వేడుకోవడం కనిపించింది. కేసీఆర్ వారికి భరోసా ఇస్తూ ముందుకు సాగారు. కేసీఆర్ పర్యటన ఇటు పార్టీ క్యాడర్‌లో జోష్ నింపగా.. రైతులకు భరోసాను ఇచ్చింది.

కేసీఆర్ కరీంనగర్ పర్యటన సాగిందిలా..

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మధ్యాహ్నం ఒంటి గంటకు కరీంనగర్ మండలం మొగ్దూంపూర్‌కు చేరుకున్నారు. గ్రామ రైతుల బాధలు విన్నారు. ఎండిన పంటలను పరిశీలించారు. అనంతరం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసానికి చేరుకొని, భోజనం చేశారు. గంగాధర మీదుగా బోయినపల్లికి చేరుకున్నారు. మధ్యాహ్నం 3.42 గంటలకు ఎండిన పంట పొలం వద్దకు చేరుకొని రైతులతో మాట్లాడారు. మధ్యాహ్నం 3.56 గంటలకు వరకు శ్రీరాజరాజేశ్వర జలాశయం శాభాష్‌పల్లి వంతెన వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి జలాలను పరిశీలించారు. బస్సు దిగి కారులో సిరిసిల్లకు చేరుకున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి 7.03 గంటల వరకు మీడియాతో మాట్లాడారు.

పోరాడుదాం.. అండగా నేనుంటా

'ఈ సర్కారుకు రైతులంటే పట్టింపు లేదు. పీఆర్ స్టంట్ల మీద ఉన్న సోయి రైతులను ఆదుకోవడంపై లేదు. రాష్ట్రంలో నాలుగు నెలల్లోనే పాలన అస్తవ్యస్తంగా మారింది. రైతులు రోడ్డు మీదపడ్డారు. బ్రహ్మాండమైన సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు ఉన్నా ఈ ప్రభుత్వం నీళ్లు ఇవ్వలేక పోతున్నది. నీటి నిర్వహణలో ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యింది. మీ (రైతుల) తరపున నేను పోరాడుతా.. మీకు అండగా ఉంట. నీళ్లు ఎట్లా రావో చూద్దాం' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రైతులకు భరోసా ఇచ్చారు. 'మీ కష్టసుఖాల్లో నేనుంటా.. మీ అందరిని ప్రభుత్వం ఆదుకునేవరకు పోరాటం చేస్తా' అని భరోసా ఇచ్చారు. శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించిన కేసీఆర్.. మొగ్దూంపూర్, బోయినపల్లి, వెదిర తదితర ప్రాంతాల్లో ఎండిపోయిన పొలాలను పరిశీలించారు. వ్యవసాయ పొలాల్లోనే రైతులతో మాట్లాడారు. నెర్రలుబారిన నేలను తడిమి చూశారు. రైతన్నల కన్నీళ్లను తుడిచే ప్రయత్నం చేశారు. శుక్రవారం ఉదయం ప్రారంభమైన కేసీఆర్ పొలం బాట సాయంత్రం వరకు సాగింది.

రైతులే యుద్ధానికి సిద్ధం కావాలి

లోక్‌సభ ఎన్నికలు అయిన వెంటనే మేడిగడ్డ నీళ్లను మనమే పోరాటం చేసి సాధించుకుందామని మొగ్దూంపూర్ రైతులతో కేసీఆర్ చెప్పారు. పచ్చని పంట పొలాలతో ఉండే కరీంనగర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెడుతున్నదని, రైతుల ప్రాణాలు తీసేందుకే ఇలా చేస్తున్నదని ఆరోపించారు. కాళేశ్వరం జలాలను తమ పంట పొలాలకు మళ్లించుకునేందుకు రైతులే యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల తర్వాత సమగ్ర కార్యాచరణ ప్రకటిస్తానని, ఈ దిశగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. పంట ఎండిపోయినందుకు పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని, ఎండిన ప్రతి ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలని, పెట్టుబడి ఖర్చులను భరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని చెప్పారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చే వరకు కొట్లాడుదామని భరోసా ఇచ్చారు. రైతులు ఎట్టిపరిస్థితుల్లోను ధైర్యం కోల్పోవద్దని సూచించారు.

రాజన్న సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ యజమానులు, కార్మికులతో చర్చిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో కేటీఆర్, పార్టీ నేతలు

ఒక్కొక్కనాడు ఏడుగురు చేనేత కార్మికులు ఒకటే రోజు చచ్చిపోయిర్రు. అప్పుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగ ఉన్నడు. ఒక్క 50 వేలు ఇవ్వాలని వేడుకున్నం. అయినా ఇవ్వలె. మేమే నిజామాబాద్, హైదరాబాద్ అబిడ్స్‌లో భిక్షాటన చేసిన రూ.7.50 లక్షలు వస్తే తీస్కపోయి భూదాన్‌పోచంపల్లిలో ఇచ్చినం.

- కేసీఆర్

మా ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లకు సంబంధించి రూ.300 కోట్ల బకాయిలున్నయ్. అవి కూడా ప్రభుత్వం ఇస్తలేదన్నరు. మీరు రండి హైదరాబాద్‌కు హైకోర్టుల కేసు వేసి ప్రభుత్వాన్ని బజారుకీడ్చుదాం. చేనేత మిత్ర పథకాన్ని కూడా బందు పెట్టిర్రు. వాళ్లు చావాల్నా. ఎక్కడికి పోవాలె. *- కేసీఆర్*

చేనేత బకాయిలియ్యకుంటే బజారుకీడుస్తం

మూడునాలుగు రోజుల్లోగా ఇయ్యాలె • లేదంటే చేనేతలు పులిబిడ్డలై గర్జిస్తరు
అవసరమైతే హైకోర్టుకు పోతరు • దొబ్బి తిన్నరని తూలనాడుతారా?
ప్రభుత్వం ఆర్డర్లు ఇస్తే కష్టం చేసిండ్లు • పథకాల కింద పేద ప్రజలకు పంపిండ్లు
నిరోధ్‌లు.. పాపడాలు అమ్ముకోమంటరా? • వాళ్లు మీకు మనుషుల్లా కనబడతలేరా?
రేపటి ధర్నాలో మేమూ పాల్గొంటాం

కాంగ్రెస్ సర్కార్ తీరుపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిప్పులు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): 'చేనేత కార్మికులకు ఆర్డర్లు ఉత్తగ ఏం ఇయ్యలె. ఉపాధి చూపి కార్మికుల ఆత్మహత్యలను నివారించడంతోపాటు, అటు పేదలను కూడా ఆదుకోవాలనేదే లక్ష్యం. ఆ ఆర్డర్లకు సంబంధించి 300 బకాయిలు ఉన్నయ్. అవి కూడా ఇస్తలేరు. అదేమంటే చేనేత కార్మికులు దొబ్బితిన్నరు అనంటరా. ప్రభుత్వం ఆర్డర్లు ఇస్తే కష్టం చేసిండ్లు. పేదలకు పంపిండ్లు. నిరోధ్‌లు.. పాపడాలు అమ్ముకుని బతకమంటరా? వాళ్లు మనుషుల్లా కనబడతలేరా? మూడునాలుగు రోజుల్లో ఆర్డర్లు, బకాయిలు రాకుంటే బజారుకీడుస్తం. చేనేత కార్మికులు పులిబిడ్డలై గర్జిస్తరు తస్మాత్ జాగ్రత్త' అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిప్పులు చెరిగారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎండిపోయిన పంటలను పరిశీలించిన అనంతరం సిరిసిల్లలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. 'సిరిసిల్ల గంగాధార మండలం పెగడపల్లి మండలం సిరిసిల్ల సిద్దిపేట పోతున్నాం. అప్పుడు జయశంకర్‌తో కలిసి పోతా ఉంటే గోడల మీద రాతలు కనబడతా ఉన్నాయి. చేనేత కార్మికుల్లారా ఆత్మహత్యలు చేసుకోకండి. చావులు సమస్యలకు పరిష్కారం కాదని, అవి చూసి నేను, నాతో ఉన్న ఉద్యమకారులు కండ్లల నీళ్లు తీస్కున్నరు. 65 ఏండ్ల స్వతంత్రభారతంలో చావకండి అని గోడల మీద రాతలు రాసే ప్రభుత్వాలు ఉంటే ఇంతకంటే దౌర్భాగ్యం ఏముంటదని బాధపడ్డం. తెలంగాణ వచ్చినంక ఎట్లన్న చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆలోచన చేసినం.

50 లక్షలు తెచ్చి, ట్రస్టు ఏర్పాటు చేసినం

ఒకటే రోజు 11 మంది కార్మికులు చనిపోతే మా పార్టీ నుంచి 50 లక్షలు తెచ్చి, ట్రస్టు ఏర్పాటు చేసినం. చావకుండా చూడండి అని బతిమాలినం. ఇప్పటికీ ఆ ట్రస్టు ఉన్నది. మేం చెప్పినం. దయచేసి చచ్చిపోవద్దని కోరినం. తెలంగాణ వస్తది తరువాత బిడ్డల్లా సాదుకుంటమని భరోసా ఇచ్చినం. ఆత్మహత్యలు బందుపెట్టమన్నం. అనుకున్న ప్రకారం తెలంగాణ వచ్చింది. బీఆర్ఎస్ గవర్నమెంట్ వచ్చింది. భువనగిరిలో, గద్వాలలో, దుబ్బాకలో, సిరిసిల్లలో రోజూ చనిపోయే చేనేత కార్మికులను ఆదుకోవాలని చెప్పి బీఆర్ఎస్ సర్కార్‌లో ఒక పద్ధతి ప్రకారం, ఇటు పేదలకు మేలు చేసేలా, చేనేత కార్మికులకు ఉపాధినిచ్చేలా పథకాలు పెట్టినం. రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్, స్కూల్ యూనిఫాం, బతుకమ్మ చీరలని పెట్టి కార్మికులకు ఆర్డర్లు ఇచ్చినం. ఇప్పుడే చేనేత కార్మికులు కలిసిన్రు. మళ్లా మాకు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. పాతకథే తయారైందని బాధపడుతున్నరు.

> *లక్షలాది మంది చేనేత కార్మికుల మనోభావాలు దెబ్బతిస్తారా? మీరు ఇస్తే ఇచ్చిండ్లు. పీకితే పీకిండ్లు.. చాతకాకపోతే ఇయ్యకుండ్రి. కానీ నిరోధ్‌లు అమ్ముకుని, పాపడాలు అమ్ముకొని బతుకుండ్రి అంటే వాళ్లు మనుషుల్లా కనబడతలేరా? చేనేత కార్మికులు పులులై గర్జిస్తరు బిడ్డా. మిమ్ముల తలమికొడతరు. జాగ్రత్త అని హెచ్చరిస్తున్న.*
> *- కేసీఆర్*

చేనేతల మనోభావాలు దెబ్బతీస్తరా?

ఇంకా దీనిమీదికెళ్లి కథ. అదేమంటే రైతు బంధు అడిగితే ఓ మంత్రి చెప్పుతోని కొడతమంటరు. చెప్పుతోని కొడతరా? నేను ఇదివరకే చెప్పిన. రైతులకు కూడా చెప్పులు ఉంటయ్. వారికి తిక్కపుట్టి మర్లేత్తె మీ గతే మైతదో ఆలోచించుకోమని చెప్పిన. సిరిసిల్లలో కార్మికులు చచ్చిపోయే గతి ఉన్నది. ఆత్మహత్యలు మొదలయ్యేట్లు ఉన్నయ్ అంటే ఇంకో కాంగ్రెసోడు అంటడు. ఏం భయం లేదు. వాళ్లను నిరోధ్‌లు అమ్ముకుని, పాపడాలు అమ్ముకుని బతకమంటడు. నిరోధ్‌లు అమ్ముకుని బతకాలా? మీరు మనుషులా?

వెంటనే చేనేత కార్మికుల బకాయిలన్నీ విడుదల చేయండని డిమాండ్ చేస్తున్న. రేపు ధర్నా తరువాత కూడా స్పందించకపోతే, మూడునాలుగు రోజుల్లో ఆర్డర్లు రాకపోతే మా పార్టీ నుంచి వకీళ్ల ఫీజులు ఇచ్చి హైకోర్టులో దావాలు వేస్తాం. కోర్టులకు గుంజుతం. కొట్లాడుతం. రాష్ట్రంలో ఎక్కడిక క్కడ ధర్నాలు చేస్తాం. మిమ్ముల ఫుట్‌బాల్ ఆడుతాం. ఎంపీ అభ్యర్థినే పెద్ద అడ్వకేట్. మీరే కేసు వేయాలె. ఇంక ఏం మాట్లాడతరు. చేనేత కార్మికులట మొన్నటి వరకు దొబ్బితిన్నరట. దొబ్బితిన్నరా? కష్టం చేసిండ్లు. గవర్నమెంట్ ఆర్డర్ ఇస్తే నేసిండ్లు. ప్రజలకు పంపించిండ్లు. లేని అవ్వలకు, అక్కచెల్లెల్లకు బతుకమ్మ పేరుమీద, రంజాన్ తోఫా మీద పోయినయ్. అటు పేదలకు అందింది. ఇటు చేనేత కార్మికులు బతికిండ్లు.

కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాలె..

ఇవ్వాళ 14 ఏండ్ల కింద చేనేత కార్మికుల బతుకు ఏం ఉండెనో మళ్లా మూడు నాలుగు నెలల్లోనే ఆ పరిస్థితిని తీసుకొచ్చింది ఈ ప్రభుత్వం. మీ ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లకు సంబంధించి రూ.300 కోట్ల బకాయిలున్నయ్. అవి కూడా ప్రభుత్వం ఇస్తలేదన్నరు. మీరు రండి హైదరాబాద్‌కు హైకోర్టుల కేసువేసి ప్రభుత్వాన్ని బజారుకీడ్చుదాం. రేపు ధర్నా పెట్టిన్రు. దాదాపు 10 వేల మందితో. అందులో మేము కూడా పాల్గొంటాం. అండగా ఉంటం. ఆ ప్రకారం చేనేత కార్మికులకు ఏం సమాధానం చెప్తారో చెప్పండి. చేనేత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాలె. అంత నీచంగా మాట్లాడినందుకు. వాళ్లకు వెంటనే ఆర్డర్లు ఇయ్యాలే. తర్వాత వెంటనే పాత బకాయిలు చెల్లించాలి. లేకపోతే ఊరుకోం. లీగల్ బ్యాటిల్ కూడా పోతం.' అని కేసీఆర్ హెచ్చరించారు.

వస్త్ర పరిశ్రమలో ఆకలి కేకలు

- 2014కు ముందు దుస్థితి
- నేత కార్మికులకు పునరావృతం
- బకాయిలు ఇవ్వని కాంగ్రెస్ సర్కార్
- ప్రమాదంలో నేత కార్మికుల బతుకులు
- నేడు సిరిసిల్లలో జేఏసీ ఆధ్వర్యంలో నేతన్న గర్జన సభ

ప్రభుత్వ చేయూత కరువై రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిలిచిపోయిన మరమగ్గాలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమ సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లు ఇవ్వక, బకాయిలు విడుదల చేయక సర్కారు సాంచాలకు సంకెళ్లు విధించింది. పనులు లేక ఉపాధి కోల్పోయిన నేతన్నలు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. ఫలితంగా అనుబంధ పరిశ్రమల యజమానులు, కార్మికుల ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పోరుబాటకు సిద్ధమైంది. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు వందలాది గొంతుకలు ఏకమయ్యాయి. శనివారం సిరిసిల్లలో పెద్ద ఎత్తున నేతన్న గర్జన పేరిట భారీ సభ నిర్వహిస్తున్నది.

సమైక్య పాలనలో ఉరితాళ్లు పేనిన వస్త్రపరిశ్రమ

సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. పనిలేక పస్తులుండి దాదాపు ఏడు వందల మంది నేతన్నల ఆకలి చావులు, బలవన్మరణాలతో సిరిసిల్ల ఉరిశాలగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్వయంగా సిరిసిల్లను సందర్శించి ఆదుకుంటానని ఇచ్చిన మాట నెరవేర్చలేదు. ఆత్మహత్యలు, ఆకలి చావులకు పాల్పడ్డ కుటుంబాలకు పరామర్శలే తప్ప న్యాయం జరగలేదు. తెలంగాణ వచ్చిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ముందుకొచ్చి తామున్నామంటూ వారి బతుకులకు భరోసా ఇచ్చారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా నేతన్నల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. చేనేత, మరమగ్గాలకు వేర్వేరుగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ.1,200 కోట్లు కేటాయించింది. మరమగ్గాలను యానిట్లుగా చేసి మ్యాక్స్ సంఘాలు, ఎస్ఎస్ఐ యానిట్లను ఏర్పాటు చేసింది. చేనేత జౌళి శాఖ ప్రత్యేక అధికారులను నియమించింది. పీక ల్లోతు సంక్షోభంలో కూరుకుపోయిన వస్త్ర పరిశ్రమకు చేయూతనిచ్చి పునర్జీవం పోసింది. కోటి బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్, ఆర్ఎం వస్త్ర ఉత్పత్తులతో నేతన్నకు చేతినిండా పని, పనికి తగ్గట్టు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు వేతనం సంపాదించేలా చర్యలు తీసుకున్నది. నూలు, విద్యుత్తు సబ్సిడీకి రూ.వేల కోట్లు ఇచ్చి ఇటు యజమానులకు, అటు ఆసాములకు, కార్మికులకు అండగా నిలిచింది. వస్త్ర ఉత్పత్తుల విభణిలో పోటీని తట్టుకునేలా తిరుపూర్, సూరత్, నాగపూర్, ఇచ్చల్‌కరంజీ లాంటి నగరాలకు యజమానులు, ఆసాములను స్టడీ టూర్‌కు ప్రభుత్వం సొంత నిధులతో పంపించింది. కార్మికుడినే యజమానిని చేయాలన్న ఉద్దేశంతో ఓనర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. 65 ఎకరాల్లో షెడ్లు కూడా నిర్మించింది. నేతన్నలకు 50 ఏండ్లు వచ్చేసరికి నెలకు రూ.2,016 ఇచ్చి ఆసరాగా నిలిచింది.

పదేండ్ల తర్వాత మళ్లీ సంక్షోభం

పదేండ్ల కింద కాంగ్రెస్ ప్రభుత్వంలో నెలకొన్న సంక్షోభం తిరిగి ఆ పార్టీ అధికారంలోకి రాగానే పునరావృతమైంది. గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లతో నడిచిన మరమగ్గం మళ్లీ మూగబోయింది. కార్మికులపై కాంగ్రెస్ కక్షగట్టింది. గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇవ్వకుండా తొక్కిపెట్టింది. పెండింగ్‌లో ఉన్న రూ.290 కోట్లు విడుదల చేయకుండా యజమానులు, ఆసాముల ఉసురు పోసుకుంటున్నది. ప్రభుత్వం నిధులు, వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లు ఇస్తే తప్ప పరిశ్రమ నడపలేమంటూ ఉత్పత్తిదారులు చేతులెత్తేశారు.

కాంగ్రెస్.. కరోనా కంటే డేంజర్

మాది సిరిసిల్లలోని బీవైనగర్. చిన్నప్పటి నుంచి సాంచాల పనిజేత్తున్న. పదేండ్లు బీఆర్ఎస్ సర్కారు ఉన్నప్పుడు సాంచాలు మంచిగ నడిచినయ్. కేసీఆర్ సారు ఇచ్చిన బతుకమ్మ చీరలు నడిపి రెండు పూటలా కడుపునిండా తిన్నం. కొత్త సర్కారు వచ్చి వంద రోజులన్న కాలే దరిద్రం జుట్టుకున్నది. పదేండ్ల కింద కాంగ్రెస్సే ఉండె. అప్పుడు సంక్షోభం అన్నరు. ఇప్పుడు మళ్ల గదే చెపుతుండ్రు. ఇక్కడ కేటీఆర్ ఉన్నడని కక్షగట్టి కార్మికులను గోసపుచ్చుకుంటున్నరు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్.. ఇది ఉన్నన్ని రోజులు మా కడుపులు ఎండుడే. ఎంత మందిని ఉరిబెట్టి సంపుద్దో?

- మహేశుని రమేశ్, నేత కార్మికుడు, సిరిసిల్ల

మరణ శాసనంగా సర్కారు విధానాలు

కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు మరమగ్గానికి మరణ శాసనంగా మారుతున్నాయి. ప్రభుత్వం నిధులివ్వకుండా ఇ బ్బంది పెడుతున్నది. యజమానులు మరమగ్గాలను బంద్ పెట్టారు. కేసీఆర్ ప్రభుత్వ పథకాలను కొనసాగించాలి. రాష్ట్ర ప్రభుత్వం రూ.290 కోట్ల బకాయిలు చెల్లించి, కొత్త ఆర్డర్లు ఇచ్చి కార్మికులకు ఉపాధి కల్పించాలి.

- మూషం రమేశ్, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలి: సీపీఎం

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లకు బకాయిలు చెల్లించలేదని తెలిపారు. రానున్న రోజులకు అవసరమైన ఆర్డర్లు కూడా ఇవ్వలేదని, ఫలితంగా ఉత్పత్తులు చేయలేమని యజమానులు చేతులెత్తేశారని పేర్కొన్నారు. దీంతో ఈ పరిశ్రమ మీద ఆధారపడ్డ 30 వేల కార్మిక కుటుంబాలు వీధినపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి.. వస్త్ర పరిశ్రమను, కార్మికులను ఆదుకోవాలని ఎస్ వీరయ్య కోరారు.

సిరిసిల్ల నేతన్నల సమస్యలను పరిష్కరించాలి : వెంకట్రాములు